క్లుప్తంగా

## నేడు టీఎల్ఎం మేళా

**పాన్‌గల్:** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు టీఎల్ఎమ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులపై మేళా నిర్వహిస్తున్నామని, ఈ మేళాకు ప్రతి పాఠశాల నుంచి ఒక్కొక్క ఉపాధ్యాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## బాబోయ్.. కుక్కలు



**వనపర్తి రూరల్:** మండలంలోని అంకూరులో కుక్కలు ఎక్కువగా సంచరిస్తుడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్నారులు, పశువులు, గొర్రెలు, మేకలకు ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో కుక్కల బెడద రోజు రోజుకూ ఎక్కువైందని, రహదారులపై సంచరిస్తూ మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పదించి కుక్కలను గ్రామం నుంచి దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తాగునీటి ఇబ్బందులు

**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజుల నుంచి గ్రామంలో పలు కాలనీలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సైతం తాగునీరు అందించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## ప్రొసీడింగ్స్ అందజేత



**వీపనగండ్ల:** మండలంలోని వల్లభాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు రావుల నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి ప్రొసీడింగ్‌లను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవాలన్న సదుద్దేశ్యంతో ప్రతి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, సుజాత, ప్రతాప్‌రెడ్డి, రవి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆవాజ్ మండల కమిటీ ఎన్నిక




**వనపర్తి రూరల్:** పెబ్బేరు పట్టణ కేంద్రంలో ఆదివారం ఆవాస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జబ్బార్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్‌ఉసేన్, ఉపాధ్యక్షులుగా నిజాం, అర్బాబ్, ప్రధాన కార్యదర్శిగా మొయిన్, సహాయ కార్యదర్శులు షకీల్, ఉసేన్, బాషా, కోశాధికారి నసీరుద్దీన్ ను నియమించారు. కార్యక్రమంలో అతీక్, ఉల్ రహేమాన్, ఎండీ ఖాజా, రహ్మతుల్లా, అఫ్సర్, ఉమర్, ఇబ్రహీం, మైనుద్దీన్, మజీద్, అఫ్రోజ్, నాజియా కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**చిన్నచింతకుంట:** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మదనాపురం మండలం కొత్తపల్లికి చెందిన పద్మమ్మ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ.. హైదరబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీని ఆదివారం దమగ్నాపురంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రోడ్డా.. చెరువా..







పట్టణం నుంచి మూలమళ్లకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ఈ రోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఇరువైపులా ముల్లపొదలు రోడ్డును కప్పి వేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు చిన్నపాటి వర్షాలకే రోడ్డంతా గుంతలమయం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కురిసిన వర్షాలతో గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. పదేళ్ల క్రితం రోడ్డు పనులు ప్రారంభించినా.. ముందుకు సాగకపోవడంతో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పీజేపీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టడంతో పాటు ముల్ల పొదలను తొలగించాలని ప్రయానికులు కోరుతున్నారు. ఆత్మకూర్

## విశ్వగురువుగా నిలిపేందుకు ఆర్ఎస్ఎస్ కృషి

**ఖిల్లాఘనపురం:** ప్రపంచంలో హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూనే భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సహ కార్యవాహ యుగేంధర్‌జీ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఏర్పడి విజయదశమి నాటికి వందేళ్లు కావస్తున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఓ కల్యాణమండపంలో మండల ఖండ కార్యవాహ భాస్కర్ ఆధ్వర్యంలో సర్వ స్వయం సేవకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ 1925 సంవత్సరంలో ఏర్పాటైన ఆర్ఎస్ఎస్ నాటి నుంచి దేశంలో హిందూ ధర్మ పరిరక్షణ చేపడుతూనే ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, దేశంపై గౌరవాన్ని పెంపొందించిందన్నారు. సంఘ వికాసంతో పాటుగా దేశంలోని అంతర్గత వ్యతిరేక శక్తులను అధిగమించి ప్రపంచ దేశాల్లోని హిందువులను సంఘటితం చేసిందని తెలిపారు.



మాట్లాడుతున్న విభాగ్ సంఘ చాలక్ శ్రీనివాస్‌రెడ్డి

## భక్తిశ్రద్ధలతో బద్రోద్దీన్ షావలి గంధోత్సవం



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**ఖిల్లాఘనపురం:** మండలంలోని తిర్మలాయపల్లి శివారులో మహబూబ్‌నగర్‌కు వెళ్లే రోడ్డు సమీపంలో ఉన్న బద్రోద్దీన్‌షావలి దర్గా గంధోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ముతవల్లి బద్రోద్దీన్ సాహెబ్ ఇంటి నుంచి గంధంతో దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.గంధోత్సవానికి గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. సోమవారం ఉర్సు కొనసాగుతుందని ముతవల్లి తెలిపారు. ఉర్సుకు ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. బద్రోద్దీన్ షావలి దర్గా ఉర్సుకు తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అర్ధరహితం

**ఆత్మకూర్:** మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆరోపణలు అర్ధరహితమని, పదేళ్ల అధికారంలో ఉండి అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా అన్నారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని ప్రగల్భాలు పలికిన చిట్టెం ఆ దిశగా.. అడుగులు వేయలేదని ధ్వజమెత్తారు. ఇక్కడి నీళ్లను నిరంజన్‌రెడ్డి పూర్తిగా తరలించుకుపోయి, పంటలను ఎండబెట్టినప్పుడు నోరు మెదపలేదని, ప్రస్తుతం రైతులకు రెండు పంటలకు నీరు అందుతుంటే సహించలేకపోతున్నారని దుయ్యబట్టారు. యూరియా విషయంలో కేంద్రం కొర్రీలు పెడుతుందని ఇక్కడి బీజేపీ ఎంపీని ప్రశ్నించాల్సింది పోయి అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న మంత్రి వాకిటి శ్రీహరిపై ఆరోపణలు చేయడమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, భాస్కర్, యాదగిరిశెట్టి, గణేష్, వెంకటనర్సింహారావు, దామోదర్, నాగేష్, సాయిరాఘవ, అశోక్, జుబైర్, అబ్దుల్లా, ఖాజన్న, రాజు, పాష తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ రహ్మతుల్లా

## ట్రాఫిక్ సమస్యతో భక్తుల ఇక్కట్లు

**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రంలో ఆదివారం ట్రాఫిక్ సమస్యతో మైసమ్మ జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారి పనులు కొనసాగుతుండటంతో ఒకే వైపు నుంచి వాహనాల రాకపోకలు కొనసాగించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. గంటల తరబడి రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. భక్తులు పోలీస్ స్టేషన్ నుంచి వెనుక భాగం ఉండే రోడ్డుపై నుంచి వెళ్తే ట్రాఫిక్ సమస్య ఉండేది కాదు. బస్టాండ్ కూడలిలో కోళ్లు, తినుబండరాలు, పూజ సామాగ్రి కొనుగోలు కోసం వచ్చినవారు వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలుపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కొల్లాపూర్ నుంచి వచ్చే వారు సాతాపూర్ మీదుగా నాగర్‌కర్నూల్ నుంచి వచ్చే భక్తులు ముష్టిపల్లి రోడ్డుపై వెళ్లాలని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి ఆదివారం సాతాపూర్ వద్ద ముష్టిపల్లి వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి మైసమ్మ జాతరకు వెళ్లే వాహనాలను రూట్ మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని భక్తులు కోరుతున్నారు.



పెద్దకొత్తపల్లి బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ సమస్యతో నిలిచిన వాహనాలు

## హిందూ సమ్మేళనాలు నిర్వహిద్దాం

**కొల్లాపూర్:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామంలో హిందూ సమ్మేళనాలు నిర్వహించాలని జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ లక్ష్మీకాంత్ సంఘం సభ్యులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని మాధవస్వామి గుడి ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. దసరా వేడుకల సందర్భంగా ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకొని హిందూ సమ్మేళనాలు ఏర్పాటు చేయాలని కోరారు. వ్యక్తి శీలత, నిర్మాణానికి సంఘం ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. హిందువులను సంఘటితం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సహ పర్యావరణ ప్రముఖ్ బృంగి కృష్ణప్రసాద్, ఖండ కార్యవాహ మేకల విజయ్ యాదవ్, ద్విఖండ ప్రచారక్ ప్రకాష్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో ఆర్ఎస్ఎస్ నాయకులు

## కొనసాగుతున్న పైపులైన్ పనులు

**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ల పనులు కొనసాగుతున్నాయి. రెండు రోజుల నుంచి బస్టాండ్ కూడలిలో పైపులైన్ పనులు చేపట్టడంతో పది గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరాను నిలిపివేశారు. సోమవారం సాయంత్రం వరకు పనులు కొనసాగే అవకాశం ఉందని ప్రజలు సహకరించాలని మిషన్ భగీరథ అధికారులు కోరారు. దీంతో పెద్దకొత్తపల్లి, దేవునితిరుమలాపూర్, బావాయిపల్లి, తీగలపల్లి, అదిరాల, చంద్రకల్, ముష్టిపల్లి, మరికల్ గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు.

## వైద్యులను నియమించాలని వినతి

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సరిపడా వైద్యులను నియమించాలని కోరుతూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. దీంతోపాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని, కొత్తకోటలో కొనసాగుతున్న వీపనగండ్ల ఎస్సీ గురుకుల పాఠశాలను వెంటనే మండల కేంద్రానికి రప్పించాలని, కేతేపల్లి వరకు డబుల్ బీటీ రోడ్డును నిర్మించాలని, బొల్లారం గ్రామ శివారులో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని కోరారు. పెద్ద చెరువు కాల్వలో జమ్మును తొలగించి పూడికను తీసి రహదారులు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆది, నాయకులు ఆశన్న, వెంకటయ్య, ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, రామకృష్ణ, మిద్దె శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వీపనగండ్ల:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్త నల్లపోతుల మద్దిలేటి ఆదివారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కావలి మహేష్, చాకలి గోపి, ముంతరాజు, బసవరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి రూరల్:** మండలంలోని అంకూర్‌లో గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కొమ్ము రాములు కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు.ఆయన మిత్ర బృందం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గ్రామస్తులు, మిత్రులు సేకరించిన రూ.9 వేల నగదు,35 కేజీల బియ్యాన్ని ఆదివారం కుమారుడు కొమ్ము వెంకటేష్, కుమార్తెకు అందజేశారు.

## అమిత్‌షా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థకు మచ్చ



**ఆత్మకూర్:** ఉప రాష్ట్రపతి బరిలో ఉన్న విపక్షాల అభ్యర్థి విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా ఆరోపణలు చేయడం అర్ధరహితమని సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై తిప్పారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతు సుదర్శన్‌రెడ్డి విపక్షాల అభ్యర్థి అయినంత మాత్రాన లేనిపోని ఆరోపణలు చేయడం న్యాయ వ్యవస్థకే మాయని మచ్చ అని ధ్వజమెత్తారు. ఈ విషయమై దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, భవిష్యత్‌లో న్యాయవ్యవస్థను కించపరిచి మాట్లాడే వారిపై కఠినంగా వ్యవహరించే విధంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానాన్ని మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థుల క్రీడల కోసం స్టేడియాన్ని మంజూరు చేశారని దీనికి అనుగుణంగానే అనువైన స్థలాన్ని పరిశీలించి మంత్రికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్‌లు పగిడాల చిన్నయ్య, డాక్టర్ కురుమూర్తి, బాలస్వామి, రామ్‌లాల్, మాజీ ఎంపీటీసీలు రవికుమార్, ధర్మేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భీరం సుదర్శన్, రాములు, సుధాకర్, రవి పాల్గొన్నారు.

## గ్రామ దేవత పండుగ

**పెద్దకొత్తపల్లి:** మండలంలోని దేవునితిరుమాలపూర్‌లో ఆదివారం మైసమ్మ దేవత పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రా మస్తులు డప్పు మేళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మైసమ్మ దేవతకు కోళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వ్యవసాయ పొలాల వద్ద విందు భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఎంఈఓ కార్యాలయం



కార్యాలయం పైకప్పు పెచ్చులూడి గోడలు



కార్యాలయం గదిలో చేరిన వర్షం నీరు (ఫైల్)

- నెర్రెలుబారిన గోడలు

**పాన్‌గల్:** విద్యాశాఖకు మూలస్తంభం లాంటి మండల వనరుల కేంద్రం (ఎంఈఓ కార్యాలయం) శిథిలావస్థకు చేరుకొంది. గదులు నెర్రెలు రావడంతో పాటు పైకప్పు పెచ్చులూడి పడుతుంది. మండల కేంద్రంలోని కార్యాలయం 26 ఏళ్ల క్రితం నిర్మించారు. వర్షాకాలంలో నీరు కారుతుండటంతో కంప్యూటర్లు, ఇతర సామగ్రిని కాపాడటం సిబ్బందికి తలకు మించిన భారంగా మారడంతో పాటు సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అయినా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు మరమ్మతుకు చొరువ చూపడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ శ్రీనివాసులును వివరణ కోరగా.. విద్యాశాఖకు మండల కేంద్రంలో ఉన్న ఎంఈఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకొని నీరు కారుతున్న మాట వాస్తవమే అన్నారు. విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించామని, నిధులు మంజూరు అయితే మరమ్మతు చేస్తామన్నారు. మరోమారు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

**పాన్‌గల్:** గ్రామాల్లో రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సీపీఎం నాయకులు ఇంటింటికీ తిరుగుతూ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని, లేనిచో పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జంబులయ్య, భీమయ్య, శివరాములు పాల్గొన్నారు.



సమస్యలపై ఆరా తీస్తున్న సీపీఎం నాయకులు

## మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న

**అమరచింత:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26న నిర్వహించే ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం మండలంలోని ధర్మాపూర్, పాంరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పంటలకు ఎమ్మెస్పీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని ఆరోపించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్వామినాథన్ కమిషన్ అందించిన నివేదిక ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కురుమన్న, రాములు, శ్రీను, రంగన్న, శివారెడ్డి, దిలీప్, నరసింహ పాల్గొన్నారు.

## రమణీయం.. రంగనాయకస్వామి రథోత్సవం

**దేవరకద్ర:** మండలంలో వెంకటాయపల్లి ఊరగుట్టపై వెలసిన రంగనాయకస్వామి రథోత్సవం ఆదివారం తెల్లవారు జామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం నెలరోజులుగా స్వామి ఆలయంలో అఖండ దీపారాధనతో భజనలు నిర్వహించగా.. గ్రామమంతా మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు నిర్వహిస్తూ వచ్చారు. శ్రావణమాసం ముగిసిన సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సం నిర్వహించారు. రథాన్ని రంగు రంగుల పూలు, మంగళతోరణాలతో అలంకరించి ప్రత్యేకంగా విద్యుద్దీపాల తోరణాలతో అలంకరించారు. ఊరగుట్టపై నుంచి స్వామి ఉత్సవమూర్తిని పల్లకీలో తీసుకొచ్చి రథంపై ఉంచి ముందుకు లాగారు. రథోత్సవం సందర్భంగా స్వామి రథాన్ని గ్రామంలోని రచ్చకట్ట వద్దకు లాగి అక్కడున్న వేపచెట్టుకు రథాన్ని తాకించారు. దీనివల్ల వేపాకు తీయగా మారుతుందని గ్రామస్తుల నమ్మకం. రథోత్సవం అనంతరం స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వెంకటాయపల్లి ఊరగుట్టపై నుంచి పల్లకీలో స్వామివారిని తీసుకువస్తున్న గ్రామస్తులు

## శ్రావణం పోయింది.. ముక్క ముట్టాల్సిందే..





శ్రావణమాసంలో చప్పబడిన నాలుకకు చేపల పులుసు, ఫ్రై ఘాటు తగిలించేందుకు ప్రజలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్దకు బారులుతీరుతున్నారు. నెల రోజులుగా జనం లేక వెలవెలపోయిన ఎడమ కాల్వ వద్ద ఉన్న చేప వంటకాల హోటళ్లు ఆదివారం జనంతో కిక్కిరిసిపోయాయి. చేపల ఫ్రై కోసం హోటళ్ల వద్ద ప్రజలు గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సి వచ్చిందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.
- అమరచింత